



జనసేనకు అనకాపల్లి

◆ కొణతాలకు టికెట్ ఇవ్వడంపై టిడిపిలో అసంతృప్తి ◆ పలువురు రాజీనామాలకు సిద్ధం
◆ తొలిదశలో బండారుకు టికెట్ విస్మరణ ◆ అయ్యన్న, అనితలకు చోటు



కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

టిడిపి, జనసేన ప్రకటించిన తొలి జాబితాలో టిడిపి నాయకులు నిరాశకు గురయ్యారు. అనుకున్నదొకటి, అయినదొకటి కావడంతో చంద్రబాబు నిర్ణయాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. కొద్ది రోజుల క్రితం జనసేనలో చేరిన కొణతాల రామకృష్ణకు జనసేన తరపున టికెట్ ఇచ్చి, టిడిపి సీనియర్ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో టికెట్లు కేటాయించకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి నుంచి పోటీకి సన్నద్ధమైన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు టిడిపి మొండిచేయి చూపింది. జనసేన, టిడిపి పొత్తులో అనకాపల్లి అసెంబ్లీ టిక్కెట్ జనసేనకు కేటాయించడంపై పీలా అనుయాయులు నిరసన వ్యక్తం చేశారు. అనకాపల్లి టిడిపి కార్యాలయం వద్ద పీలా నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. 83వ వార్డు ఇన్‌ఛార్జ్ బి.ప్రసాద్, 82వ వార్డు ఇన్‌ఛార్జ్ త్రినాథ్ సహా పలువురు టిడిపికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. పీలాకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేయించి గెలిపిస్తామని మీడియా సమావేశంలో ప్రకటించారు. శనివారం ప్రకటించిన తొలి జాబితాలో టిడిపి నుంచి అయ్యన్నపాత్రుడు (నర్సీపట్నం), వంగలపూడి అనిత (పాయకరావుపేట), జనసేన నుంచి అనకాపల్లి అభ్యర్థి కొణతాల వున్నారు. యలమంచిలి, చోడవరం, పెందుర్తి, వి.మాడుగుల నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. టిడిపి సీనియర్ నాయకుడు బండారు సత్యనారాయణమూర్తిని పక్కన పెట్టడంతో ఆయన అవమానంగా భావిస్తున్నారు.

టిడిపి, జనసేన పొత్తులో పెందుర్తి, యలమంచిలి సీట్లు జనసేన డిమాండ్ చేస్తున్నాయి. పెందుర్తి నుంచి జనసేన జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, యలమంచిలి నుంచి ఆ నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ సుందరపు విజయకుమార్ పోటీచేయాలని పట్టుబడుతున్నారు. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో ఒక చోట జనసేనకు కేటాయించనున్నారని తొలుత ప్రచారం జరిగింది. జనసేనలో కొణతాల చేరిన తరువాత తొలి అంచనాలు తారుమారయ్యాయి. అనకాపల్లి ఎంపీ టికెట్ కొణతాలకు కేటాయిస్తారని అనుకున్నా కాలక్రమంలో అనకాపల్లి కేంద్రంగా ఆయన కదలికలు వుండడంతో అనకాపల్లి టికెట్ ఆయనకు ఇవ్వనున్నట్లు ఊహగానాలొచ్చాయి. చివరకు ఆ ఊహకు తగినట్లు కొణతాలకు టికెట్ దక్కింది. టిడిపి నుంచి జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ టికెట్ ఆశించారు. తనకు టికెట్ దక్కుతుందన్న ఆశతో పీలా ధీమాగా వున్నారు. కొద్ది రోజుల క్రితం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ నిర్వహించిన శంఖారావం సభలో పీలా చురుగ్గానే వ్యవహరించారు. టికెట్ కేటాయింపులో పీలాకు ఇవ్వకుండా, కొత్తగా జనసేనలో చేరిన కొణతాలకు ఇవ్వడం పట్ల కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీలో చేరిన దాడి వీరభద్రరావు, ఆయన తనయుడు రత్నాకర్‌కు చుక్కెదురైనట్లయింది. పీలా గోవింద్ అనుచరులు ఆయనకు టికెట్ ఇవ్వకపోవడంతో నిరసన వ్యక్తంచేస్తూ రాజీనామాలకు సిద్ధమైనా ఆయన మాత్రం మౌనంగా వున్నారు.



కొణతాలకు టికెట్ కేటాయించడంతో అనకాపల్లిలో నిరసన తెలుపుతున్న టిడిపి కార్యకర్తలు

విశాఖలో వెలగపూడి, గణబాబులకు చోటు

- పాసర్ల ప్రసాద్ రాజీనామా

సింహాచలం : టిడిపి విశాఖ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు టిడిపి తరుపున వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబులకు చోటుదక్కింది. దీంతో ఎప్పటి నుంచో పశ్చిమ టికెట్ ఆశిస్తున్న టిడిపి విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాసర్ల ప్రసాద్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. 42 ఏళ్ల నుంచి పార్టీకి చేస్తున్న సేవను, తమ కుటుంబాన్ని పరిగణలోకి తీసుకోలేదని ఆయన ఓ ప్రకటనలో వాపోయారు.

నేడు 105 కేంద్రాల్లో గ్రూప్ - 2 పరీక్ష

- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గ్రూప్ - 2 పరీక్ష ఆదివారం జిల్లా వ్యాప్తంగా 105 కేంద్రాల్లో జరగనుంది. ఈ మేరకు ఎపిపిఎస్‌సి, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు జరిగాయి. పరీక్షకు మొత్తం 47,491 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. అన్ని విభాగాలూ సమన్వయంతో వ్యవహరించి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలన్నారు. పరీక్ష ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని వెల్లడించారు. పరీక్ష సజావుగా జరిగేందుకు 105 మంది లైజన్ అధికారులు, 105 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 29 మంది రూట్ అధికారులను నియమించినట్లు వివరించారు. అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని అధికారులు సూచించారు. పరీక్ష హాల్లోకి ఎటువంటి సెల్‌ఫోన్లూ, ఎలక్ట్రానిక్ పరికరాలూ, పుస్తకాలనూ అనుమతించరాదని చెప్పారు. పరీక్ష కేంద్రంలోనికి గంట ముందే అభ్యర్థులు చేరుకోవాలని, ఉదయం 10:15 గంటలు దాటిన తరువాత అనుమతించబోరని స్పష్టం చేశారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుని పటిష్ట చర్యలు చేపట్టినట్లు వివరించారు. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు హాలులోనే ఉండాలని హితవు పలికారు. అనకాపల్లిలోనూ పరీక్ష నిర్వహణకు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.

మహిళలు అన్నింటా మరింత పురోగతి సాధించాలి

- సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పిఎస్.నరసింహ ఆకాంక్ష



మాట్లాడుతున్న నరసింహ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి మహిళా సాధికారిత దిశగా ఎదగాలని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పిఎస్.నరసింహ ఆకాంక్షించారు. దేశంలో తొలి మహిళా న్యాయవాది అయిన ఫాతిమా బీబీ భారత దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో తొలి మహిళా జడ్జిగా పనిచేసిన సంగతిని గుర్తు చేశారు. సౌకర్యాలు అంతంత మాత్రంగా ఉన్న రోజుల్లోనే స్త్రీలు న్యాయవాద వృత్తిలో అడుగుపెట్టి తమని తాము నిరూపించుకున్నారని తెలిపారు. నేటి ఆధునిక యుగంలో స్త్రీలు మరింత పురోగతి సాధించాలని, విజయవంతంగా రాణించాలని ఈ సందర్భంగా మహిళా న్యాయవాదులను ఉద్దేశించి పేర్కొన్నారు. నగరంలోని మహిళా న్యాయవాదుల ఆధ్వర్యంలో శనివారం మహిళా సాధికారత – రాజ్యాంగ పరమైన ఆవశ్యకత అనే అంశంపై స్థానిక గ్రీన్ పార్క్ హోటల్‌లో సదస్సు జరిగింది. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు అతిథులుగా హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహ మాట్లాడుతూ మహిళలు పని చేసే చోట తగిన గౌరవం ఉండాలని, కానీ నేటికీ పలు చోట్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ మహిళల సాధికారితపై ఇటువంటి సదస్సు జరగడం సంతోషకరమని అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ మాట్లాడుతూ మహిళలు దేనికీ తక్కువ కాదని, ధైర్యంగా ముందుకెళ్లాలని, మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రాంబాబు, సీనియర్ న్యాయవాది డి.అరుణ కుమారి, హైకోర్టు జడ్జి, విశాఖపట్నం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి యు.దుర్గాప్రసాదరావు, హైకోర్ట్ జడ్జిలు జస్టిస్ బిఎస్.భానుమతి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంవి.శేషమ్మ పాల్గొన్నారు. అనంతరం సుప్రీంకోర్టు, హైకోర్ట్ చీఫ్ జస్టిస్‌లు, సీనియర్ న్యాయమూర్తులను దుశ్శాలువ, జ్ఞాపికలతో ఆహ్వానితులు, యువ మహిళా న్యాయవాదులు ఘనంగా సత్కరించారు.

26న అమృత్ భారత్ స్టేషన్లకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారత రైల్వేల ఆధునికీకరణకుగాను కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ భారత స్టేషన్ల పథకంలో భాగంగా ఈ నెల 26న దేశవ్యాప్తంగా 554 స్టేషన్ల పునరాభివృద్ధికి, 1500 రోడ్డు ఓవర్, అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి భారత ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేస్తారని వాల్తేరు డివిజన్ డిఆర్ఎం సౌరవ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శనివారం విశాఖలోని డిఆర్ఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అదే రోజున వాల్తేరు డివిజన్‌కు సంబంధించి రూ.661.60 కోట్లు విలువచేసే 12 రైల్వేస్టేషన్ల పునర్నిర్మాణ పనులకు, నాలుగు రోడ్డు ఓవర్, అండర్ బ్రిడ్జిల పనులకు శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ఈ స్టేషన్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 10 ఉన్నాయన్నారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు 2025-26 ఆర్థిక సంవత్సరానికి పూర్తవుతాయని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఆర్ఎం

ప్రజలను కులం, మతం పేరిట విభజిస్తున్న

బిజెపిని ఓడించేందుకు ముందుకురండి

ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజలను కులం, మతం, ప్రాంతం పేరుతో విభజిస్తోందని, దీన్ని గుర్తెరిగి రానున్న ఎన్నికల్లో బిజెపిని గద్దె దించేందుకు మహిళలు ముందుకు రావాలని ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలే పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ స్వర్ణోత్సవాలలో భాగంగా శనివారం ఎల్ఐసి భవనంలోని అసెంబ్లీ హాల్‌లో ఉమెన్ ఫెస్ట్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బిజెపి పాలన కారణంగా దేశంలో బాలికల పరిస్థితి దిగజారిపోయిందన్నారు. పదేళ్ల మోడీ పాలనలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు విపరీతంగా పెరిగాయన్నారు. ఎపిలో బాలికల అదృశ్యం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్ఐసిలో ఎఐఐఇఎ మహిళా ఉద్యోగుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షిస్తూ, సురక్షితమైన పని వాతావరణం కల్పిస్తోందని ప్రశంసించారు. మరొక అతిథిగా పాల్గొన్న ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ ఉపాధ్యక్షురాలు ఎస్‌కె.గీత మాట్లాడుతూ ఎల్ఐసితో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థలనూ విక్రయించడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూనుకుందన్నారు. ఈ చర్యను అడ్డుకోవడానికి ఎల్ఐసి ఉద్యోగులతో పాటు అందరూ కృషి చేయాలన్నారు. ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్ స్వాగతం పలికిన ఈ సభకు జి.సూర్యప్రభ అధ్యక్షత వహించారు. కామేశ్వరి, జె.సత్యవాణి తదితరులు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా తలపెట్టిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



మాట్లాడుతున్న మరియం ధావలే



మాట్లాడుతున్న ఆర్ఎఆర్ఎస్ పరిశోధన సహ సంచాలకులు జగన్నాథరావు

వ్యవసాయాభివృద్ధిలో ఆరుతడి పంటలు కీలకం

ప్రజాశక్తి -అనకాపల్లి : జిల్లాలో వ్యవసాయ అభివృద్ధిలో ఆరుతడి పంటలు కీలకమని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పరిశోధన సహసంచాలకులు డాక్టర్ పివికె జగన్నాథరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అభ్యుదయ రైతులతో జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా మాట్లాడారు. ఆరుతడి పంటలైన మినుము, పెసర, నువ్వులు జనుము, మొక్కజొన్న పంట పంటలు స్వల్ప కాలంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం సంపాదించవచ్చని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ ప్రతినిధి శ్రీధర్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో సరైన వర్షపాతం నమోదు కాకపోవడంతో దాని ప్రభావం రబీపై పడి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. కొక్కిరాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎ.అప్పలస్వామి మాట్లాడుతూ తమ పరిశోధన స్థానం నుంచి విడుదలైన వైఎల్ఎం 66 నువ్వుల రకం ఉపయోగించి సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు విశాలాక్షి రామలక్ష్మి, రమణమూర్తి, ఉమామహేశ్వరరావు, వ్యవసాయ సబ్ డివిజన్ల ఏడీఏలు పాల్గొన్నారు.

అలరించిన రేలారే రేలా జానపద గీతాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లిలో జరుగుతున్న శ్రీఉమామహేశ్వరి దేవి (తీర్థ) కళ్యాణం మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన రేలారే రేలా రఘు బృందం ఆలపించిన జానపద గీతాలు అందరినీ అలరించాయి. ఈనెల 21న ప్రారంభమైన తీర్థ మహోత్సవాలు ఆదివారం ముగియనున్నాయి. ముగింపు సందర్భంగా స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, పాత బస్టాండ్, అంబేద్కర్ కాలనీ, శ్రీమహేశ్వరి థియేటర్ తదితర ప్రాంతాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు శంభువానిపాలెం వెళ్లే దారి చిటికిరెడ్డి వారి గురువు వద్ద జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పందెం జరుగుతుందని ఎంపీపీ రాజేశ్వరి భాస్కరరావు తెలిపారు.

జనసేన నుండి వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పరిధిలోని జనసేన పార్టీకి చెందిన మాసవరపు అప్పారావు తన అనుచరులు 18 కుటుంబాలతో కలిసి శనివారం పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సమక్షంలో వైసిపిలో చేరారు. దలాయిపాలెం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వీరికి ఎమ్మెల్యే వైసిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బంధం నాగేశ్వరరావు, బూస అప్పలరాజు, పార్టీ మండల అధ్యక్షులు కోన రామారావు, భరణికం సర్పంచ్ పెదిశెట్టి శేఖర్, పిఎసిఎస్ ఛైర్మన్ బురద రాజు, వాడచీపురుపల్లి ఎంపీటీసీ గెడ్డం పుష్ప చంద్రరావు, పెందుర్తి మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ పైల అప్పలనాయుడు, నాయకులు కూండ్రపు తాతాజీ, కంచిపాటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సమక్షంలో వైసిపిలో చేరిన అప్పారావు తదితరులు

దర్జాగా కబ్జాలు

- ఆ పై అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

ప్రజాశక్తి-సబ్బవరం

మహా విశాఖపట్నం నగరానికి కూతవేటు దూరంలో ఉన్న సబ్బవరం మండలంలోని భూముల ధరలకు రెక్కలు రావడంతో ఈ ప్రాంతంలో భూకబ్జాలు పెచ్చుమీరిపోతున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువులు, గెడ్డలు, కొండ పోరంబోకు స్థలాలను దర్జాగా కబ్జా చేసి ఆ పై అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన రెవెన్యూ యంత్రాంగం కాసులకు కక్కుర్తిపడి, అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మండలంలోని అసకపల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 160/1లో సుమారు 68 సెంట్లు చాకలిబంద చెరువు ఉంది. ఆ భూమిలో కొంత భాగాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి రేకుల షెడ్డు నిర్మించాడు. అయినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదు. అసకపల్లి సర్వే నెంబర్ 139లో సుమారు 60 సెంట్లు వాగు పోరంబోకు ఉండగా అందులో అక్రమంగా రోడ్డును, రేకుల షెడ్లను నిర్మించారు. ఈ విషయమై రెవెన్యూ యంత్రాంగాన్ని వివరణ కోరగా ఆక్రమణలు నిజమేనని చెబుతూ, త్వరలో ఖాళీ చేస్తామని చెబుతూ కాలాయాపన చేస్తున్నారు. భూకబ్జాలపై రెవెన్యూ యంత్రాంగం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని పలురువు గ్రామస్తులు కోరుతున్నారు. లేకుంటే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెబుతున్నారు.

అమృతపురంలో కొండను తవ్వి అక్రమ నిర్మాణం

మండలంలోని అమృతపురం గ్రామంలో సర్వే నెంబర్ 303లో కొండను తవ్వి అక్రమంగా భవనాన్న నిర్మించారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. అక్రమ నిర్మాణదారులకు గ్రామ ప్రతినిధులు కొమ్ము కాస్తూ కాపాడుతున్నారు. ఈ గ్రామంలో సెంటు భూమి ధర సుమారు రెండు, మూడు లక్షల రూపాయలు పలుకుతుంది. మూడు సెంట్లు స్థలాన్ని ఆక్రమించి భవనాన్ని నిర్మించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తాము భవన నిర్మాణాన్ని నిలిపివేయమని చెప్పినప్పటికీ ఆక్రమణదారులు తమ మాటను లెక్కచేయకుండా భవనం నిర్మించారని చెప్పడం విడ్డూరంగా ఉంది. అధికారులు ప్రజాప్రతినిధులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారన్న మాటకు ఇది నిదర్శనంగా ఉంది. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కళ్ళు తెరిచి అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.



అమృతపురం సర్వే నెంబర్ 303లో కొండను తవ్వి భవన నిర్మాణం చేస్తున్న దృశ్యం

సార్వత్రిక ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు

జిల్లా కలెక్టరు రవి పట్టన్ శెట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా వుండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు రవి పట్టన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో ఎన్నికల ముందస్తు ఏర్పాట్లుపై నోడల్ అధికార్లు, ఈఆర్ఓ, ఎఈఆర్వోలతో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ చిన్న తప్పుకు అవకాశం లేకుండా పగడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులన్నింటినీ కల్పించాలని సూచించారు. వికలాంగులు, వృద్ధులకు ర్యాంపులు తప్పని సరిగా వుండాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో మోడల్ (నమూనా) పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈవీయంల ద్వారా ఓటు వేసే విధానం, తమ ఓటు ఎక్కడ వుందో తెలుసుకునే విధానాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఎమ్.కె.మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో జిల్లా కలెట్టరు, అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను గురించి, ఎన్నికల ముందస్తు ఏర్పాట్లను గూర్చి కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో ఆర్డీవో చిన్నికృష్ణ, నోడల్ అధికారులు డ్వామా పిడి ఇ.సందీప్, ఆర్అండ్‌బి ఈఈ రమేష్, మత్స్యశాఖ డిడి ప్రసాదరావు, ఎపిఎమ్ఐపి పిడి కెవి.లక్ష్మి, డిఎస్ఓ కెవిఎల్ఎన్ మూర్తి, పౌర సరఫరాల డియం జయంతి, లీడ్ బ్యాంక్ మేనేజరు సత్యనారాయణ, డిసిఓ కిరణ్ కుమారి, అసెంబ్లీ నియోజకవర్గాల ఈఆర్ఓలు సత్యవాణి, కె.మనోరమ, కె.గీతాంజలి, తహశీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, వివిధ శాఖల అధికారులు



ఇఒపిఆర్‌డికి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

ఎల్ఇడి బల్బుల విద్యుత్ ఛార్జీలు చెల్లించేది లేదు

తీర్మానించిన మండల సర్పంచ్‌ల సంఘం

ప్రజాశక్తి -మునగపాక

గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన ఎల్ఈడి బల్బుల విద్యుత్ ఛార్జీల బిల్లులు చెల్లించేది లేదని మండల సర్పంచుల సంఘం స్పష్టం చేసింది. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన మండల సర్పంచ్‌లో సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ 2013లో నాడు గ్రామపంచాయతీలలో ఎల్ఈడి బల్బులు ఏర్పాటు చేశారని, వాటి విద్యుత్ బిల్లులు 2018 వరకు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని 2021లో సర్పంచ్‌లుగా ఎన్నికైన తమను చెల్లించమని ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ఎల్ఈడీ బల్బులు ఎక్కడ ఉన్నాయి? వాటి నిర్వహణ బాధ్యతలు ఎవరు చూసుకుంటున్నారు? అనేది తమకు ఇంత వరకు తెలియపరచలేదన్నారు. ఇప్పుడున్న పరిస్థితులలో విద్యుత్ బిల్లులు బకాయిలు చెల్లించలేదమని స్పష్టం చేశారు. అనంతరం ఇఒపిఆర్‌డి వెంకటలక్ష్మికి బిల్లులు చెల్లింపు నిరాకరణతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు దిమ్మల అప్పారావు, కాండ్రేగుల నూకరాజు, భీమిశెట్టి మంగలక్ష్మి కృష్ణారావు, బీసెట్టి గంగ అప్పలనాయుడు, దాసర అప్పారావు, బొడ్డేటి శ్రీనివాసరావు, జి సూరప్పారావు, చదరం గణేష్ నాయుడు, సుందరపు నీలకంఠ స్వామి తదితరులు పాల్గొన్నారు.

'బాబు సూపర్ సిక్స్'పై ప్రచారం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : తెలుగుదేశం పార్టీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను నియోజకవర్గాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు పిలుపునిచ్చారు. మేరకు అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గం నుండి ప్రతినిధులను ఎంపిక చేసి వారి ద్వారా ప్రతి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించటానికి పార్లమెంట్ కార్యాలయంలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమం పేద ప్రజలను ఆదుకోవడానికి చంద్రబాబు నాయుడు ఆలోచనతో రూపుదిద్దుకుందన్నారు. ఆరు పథకాలను తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ప్రతి ఇంటికి పార్టీ సభ్యులు వెళ్లి ఈ పథకాలకు అర్హులను గుర్తించి హామీ పత్రాన్ని ఇవ్వాలని సూచించారు.

రహదారి పనులను పున:ప్రారంభించాలని నిరసన

ప్రజాశక్తి-అనకాపల్లి : పెరుగు బజార్ జంక్షన్ నుండి రైల్వే స్టేషన్ మార్గంలో నిలిచి పోయిన రహదారి పనులను తక్షణమే పున:ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతూ సిద్దార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం ఆధ్వర్యంలో శనివారం ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ 6 నెలల క్రితం ఈ రహదారి వెడల్పు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారని, 3 నెలలుగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. అనంతరం జివిఎంసి జోనల్ కార్యాలయంలో పట్టణ రోడ్డు ఇంజినీరింగ్ విభాగ సూపరింటెండెంట్ కె.రామ్మోహన్‌రావుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పట్నాల కృష్ణ మోహన్, బూడిద జోగారావు, నేలపూడి బాలరాజు, గిలకల అప్పారావు, ఎస్.బ్రహ్మానందం, గ్రంధి రామలక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో అభివృద్ధి ఏదీ : ఆర్‌ఎస్‌డిపి

ప్రజాశక్తి- పద్మనాభం : గత ఐదేళ్లుగా భీమిలిలో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని మాజీ మంత్రి ఆర్‌ఎస్‌డిపి అప్పలనరసింహరాజు ఆరోపించారు. పాండ్రంగి గ్రామంలోని తన నివాసంలో ఉన్న ఆర్‌ఎస్‌డిపి అప్పలనరసింహరాజును శనివారం భీమిలి జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ కుమార్ కలిశారు. ఈ సందర్భంగా అప్పలనరసింహరాజు మాట్లాడుతూ, ఈ ప్రభుత్వంపై అంగన్‌వాడీ, ఆశ, నిరుద్యోగులు, ఉద్యోగులు తదితర అన్ని వర్గాల వారు వ్యతిరేకంగా ఉన్నారన్నారు. తగరపువలసలో ఆర్టీసీ కాంప్లెక్స్ కలగానే మిగిలిందని తెలిపారు. ఇటువంటి సమయంలో ప్రభుత్వాన్ని ఓడించడానికి మనందరం ఒక తాటిపైకి రావాలని సూచించారు. 2024 ఎన్నికల్లో జనసేన -టిడిపి కూటమి విజయం సాధిస్తుందన్నారు. జనసన పల్లె యాత్రలో భాగంగా వెంకటాపురం, రేవిడి, పాండ్రంగి, అనంతవరం, పెంట, కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో జనసేన నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు కె.రామస్వామినాయుడు, ఉపాధ్యక్షులు జె.సంతోష్, టిడిపి నాయకులు కె.రమణ, ఎ.గంగరాజు, పి.రమణ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందిస్తున్న సాంకేతిక విద్యాపరిషత్ ప్రతినిధులు

స్టార్టప్‌పై అవగాహన

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ సమీపంలోని సాంకేతిక విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యాన స్టూడెంట్ డెవలప్‌మెంట్ ఆన్ స్టార్టప్ అండ్ అబ్రాడ్ ఎడ్యుకేషన్‌పై మూడు రోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్లు ఎస్ఎస్.సుందర్, కె.అనుదీప్ పాల్గొని విద్యార్థుల ఉద్యోగాల కోసం, విదేశీ చదువుల గురించి అవగాహన కల్పించి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.రాహుల్, అల్వార్‌దాస్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మధుభట్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జె.ఆనంద్‌చందూలాల్, అడ్మిషన్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్‌సి.అనిల్, డాక్టర్ హరిబాబు, మెకానికల్ విభాగాధిపతి ఎం.పద్మనాభం, ఈవెంట్ కో-ఆర్డినేటర్ కెవి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వికె.పాలెంలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్


వీకే.పాలెంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని వీకే.పాలెంలో అదనపు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ అధికారులు శనివారం ప్రారంభించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో గ్రామంలో లో-వోల్టేజ్ సమస్య పరిష్కారమవుతుందని విద్యుత్ అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు సన్యాసినాయుడు, సన్యాసప్పుడు, ఉప సర్పంచ్ బి.లక్ష్మి, రామకృష్ణ, చైతన్య, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నేడు శ్రీకృష్ణదేవరాయులు, వంగవీటి రంగా విగ్రహాల ఆవిష్కరణ

ప్రజాశక్తి -గోపాలపట్నం: జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్‌లో శ్రీకృష్ణదేవరాయులు, వంగవీటి మోహనరంగ విగ్రహాలను ఆదివారం ఆవిష్కరించనున్నట్లు గోపాలపట్నం కాపు సేవా సంఘం సభ్యులు తెలిపారు. సుమారు రూ.2 కోట్లు మంజూరు చేయించి కాపు కల్యాణ మండపం అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్‌కు అభినందన సభ ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆదివారం నాయుడు తోట నుంచి పద్మనాభనగర్ వరకు బైక్ ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ హాజరు కానున్నారని తెలిపారు.

విమ్స్‌లో కేన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ సేవలు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో కేన్సర్, బ్రెయిన్ స్ట్రోక్‌కు సంబంధించిన సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ మేరకు శనివారం మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూరాలజీ విభాగాలను విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోవిడ్ అనంతరం గడిచిన మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విమ్స్ ఆస్పత్రి అభివృద్ధి శరవేగంగా కొనసాగుతుందన్నారు. విమ్స్ ఆస్పత్రికి అవసరమైన వైద్యులు, ఇతర సిబ్బందిని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. కోవిడ్ అనంతరం 70, 80 ఉన్న ఇన్ పేషెంట్‌ల సంఖ్య క్రమంగా 200 మందికి చేరిందని పేర్కొన్నారు.

కేన్సర్ రోగులకు వైద్య సేవలు అందించేందుకు సర్జికల్ ఆంకాలజీ ఇద్దరు వైద్యులను, మెడికల్ ఆంకాలజీ ఇద్దరు వైద్యులను ప్రభుత్వం నియమించిందని తెలిపారు. మెడికల్ ఆంకాలజీ ద్వారా కీమోథెరపీని రోగులకు అందించనున్నట్లు పేర్కొన్నారు. గర్భాశయ, నోటి, రొమ్ము కేన్సర్, కేన్సర్ కాయలను సర్జికల్ ఆంకాలజీ వైద్యులు సర్జరీల ద్వారా తొలగించనున్నట్లు వివరించారు.

అధిక ఒత్తిడి కారణంగా వచ్చే బ్రెయిన్ స్ట్రోక్ నుంచి రోగులకు వేగంగా కోలుకునేందుకు రూ.వేలు విలువ చేసే ఇంజక్షన్లను ఉచితంగా అందించేందుకు న్యూరాలజీ వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే న్యూరో సర్జరీ సేవలు రోగులకు పూర్తిస్థాయిలో అందిస్తున్నట్లు తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్ యూనిట్‌ను ప్రత్యేకంగా విమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ యూనిట్ ద్వారా హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్ సమయంలో అత్యవసరంగా అందించే రూ.50 వేలు విలువ చేసే


విమ్స్‌లో నూతన విభాగాలను ప్రాంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

టేనెక్టెప్లసే (Tenecteplase) ఇంజక్షన్‌ను ఉచితంగా అందించనున్నట్లు చెప్పారు. స్ట్రోక్, హార్ట్ ఎటాక్ వచ్చిన వారికి 3 నుంచి 4 గంటల వ్యవధిలో ఈ ఇంజక్షన్ అందిస్తే లేచి నడుచుకుంటూ తిరుగుతారని తెలిపారు.

త్వరలో మరిన్ని విభాగాలు..

విమ్స్ ఆసుపత్రి నందు అతి త్వరలో మరిన్ని విభాగాలు అందుబాటులోకి రానున్నాయని డైరెక్టర్ తెలిపారు. అడ్వాన్స్‌డ్ ఎక్విప్మెంట్ ద్వారా గ్యాస్ట్రోఎంటరాలజీ సేవలు, ఒబిసిటీ సేవలు, బర్న్స్ వార్డును అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

తీరంలో ఆక్రమణలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి మంగమారిపేట తీరంలో రాళ్ళు, గ్రావెల్ వేసి కొంత మంది బడాబాబులు ఆక్రమణలకు యత్నిస్తున్నప్పటికి ఎందుకు చర్యలకు వెనుకాడుతున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు సంబంధిత అధికారులను ప్రశ్నించారు. స్థానికంగా శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బీచ్ రోడ్డు చాకిరేవు ఏరియాలో ఓ గెడ్డను సైతం కొందరు ఆక్రమణకు ప్రయత్నిస్తున్నా జివిఎంసి అధికారుల నుంచి స్పందన లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తంచేశారు. సిఆర్‌జెడ్ నిబంధనలను ఉల్లంఘించి శాశ్వత కట్టడాలు, నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ ఎందుకు పట్టనట్టుగా ఉన్నారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు.

చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం


చేనేత వస్త్ర ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -పిఎం పాలెం : మధురవాడ శిల్పారామంలో ఏర్పాటుచేసిన అఖిల భారత చేనేత వస్త్ర ప్రదర్శన ఎక్స్ పో-2024 శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఈ నెల 24 నుంచి మార్చి 8వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, 9 రాష్ట్రాల నుంచి సుమారు 60 స్టాల్స్ ద్వారా కళాకారులు తాము తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచారని తెలిపారు. వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ప్రజలు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ, హ్యాండ్లూమ్ చీరలు, డ్రస్ మెటీరియల్స్, మంగళగిరి, వెంకటగిరి జరీ, చీరాల, మచిలీపట్నం, కడప, నారాయణపేట్, ఉప్పాడ, ధర్మవరం, పోచంపల్లి, సిద్దిపేట కాటన్, పెద్దాపురం, కుప్పడం శిల్క్, గద్వాల్ శిల్క్, వరంగల్ డర్రీస్, శ్రీకాకుళం ఖాదీ, కడప కాటన్ ప్రింటెడ్ టవల్స్, లుంగీలు, కాశ్మీరి శిల్క్, ఉత్తర్‌ప్రదేశ్ బెడ్ షీట్స్, కాటన్ బెడ్ షీట్స్, దర్రీస్ భాగల్పూర్ చాదర్, శిల్క్ షర్టింగ్, మధురై చీరలు, శంబల్పూరి ఇక్కత్ తదితరాలు ఈ క్రాఫ్ట్ మేళాలో విక్రయానికి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నగరాల కార్పొరేషన్ చైర్పర్సన్ పోతిన శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, వైసిపి నాయకులు గుంటుబోయిన సంజీవ్‌కుమార్, బగాది లక్ష్మణ, కొండపల్లి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పెందుర్తి టికెట్ రసవత్తరం

ప్రజాశక్తి-పెందుర్తి : టిడిపి, జనసేన పొత్తుతో పెందుర్తి టిక్కెట్‌పై రసవత్తరంగా రాజకీయ చర్చలు సాగుతున్నాయి. గత కొద్ది నెలల నుంచి జనసేన, టిడిపి నేతలు ఈ సీటు కోసం ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. జనసేన నుంచి శివశంకర్, పంచకర్ల రమేష్‌బాబు, టిడిపి నుంచి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఈ టిక్కెట్ నాదంటే నాదంటున్నారు. అధిష్టానం ప్రకటించినప్పుడు చూసుకుందాం అన్నట్లు ఇంతవరకు ఉన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తొలి జాబితాను ప్రకటించినా అందులో పెందుర్తికి చోటు దక్కలేదు. దీంతో జనసేన, టిడిపి నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది. పెందుర్తి టికెట్ కేటాయింపు అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఏ విధంగా నాయకులను బుజ్జగించి అభ్యర్థిని ప్రకటిస్తారో చూడాల్సి ఉంది.


ముడసర్లోవలో పర్యటిస్తున్న జివిఎంసి కమిషనర్ సాయికాంత్‌వర్మ

జివిఎంసి స్థలాలను పరిరక్షించాలి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసికి చెందిన ఖాళీ స్థలాలను గుర్తించి, వాటిని పరిరక్షించాని జివిఎంసి కమిషనర్ సిఎం సాయికాంత్‌వర్మ అధికారులను ఆదేశించారు. 13వ వార్డు పరిధి ముడసర్లోవ నర్సరీని శనివారం ఆయన పరిశీలించారు. అక్కడ ఉన్న స్థల విస్తీర్ణం, మొక్కల వివరాలను హార్టీ కల్చర్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.దామోదరరావును అడిగి తెలుసుకున్నారు. ముడసర్లోవలో ఆకర్షణీయమైన పిల్లల పార్కు ఏర్పాటుకు ఇక్కడ ఉన్న నర్సరీని తరలించేందుకు స్థల పరిశీలన చేయాలని అధికారులకు ఆదేశించారు. ముడసర్లోవ పరిసర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న జివిఎంసి ఖాళీ స్థలాలను గుర్తించి వాటిని సర్వే జరిపి నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. అనంతరం ఆరిలోవ కాలనీలో ఉన్న ఎంఎస్‌ఎఫ్ నుంచి ఆరిలోవ ఆఖరి బస్టాపు వరకు ఉన్న డబుల్ రోడ్డులో వ్యర్థాలు చెత్తతో నిండి ఉండడాన్ని గమనించి పరిశుభ్ర చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ శైలజ వల్లీని, ఎఎంహెచ్ కిషోర్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో జివిఎంసి పర్యవేక్షక ఇంజినీరు శ్యాంసన్ రాజు, ఎఇ శాంతిరాజు తదితరులు ఉన్నారు.

కాలువలు చెరువులను తలపిస్తున్నాయి...

ప్రజాశక్తి-పెందుర్తి : కాలువలు చెరువులను తలపిస్తున్నాయని జనసేన నాయకుడు గల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. జివిఎంసి 88వ వార్డు పరిధి గవర జగ్గయ్యపాలెంలో శనివారం జనసేన నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంటులు, ఇళ్లకు సంబంధించి సరైన డ్రెయినేజీలు లేకపోవడంతో మురుగు నీరు నగరం నడిబొడ్డున నిల్వ ఉంటుందని తెలిపారు. దీని వల్ల దోమలు ప్రబలి డెంగీ, మలేరియా వ్యాప్తి చెందే అవకాశముందని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

వైసిపి జెసిఎస్ మండల ఇన్‌ఛార్జిగా సూర్యప్రకాష్



ప్రజాశక్తి-పెందుర్తి : వైసిపి జెసిఎస్ పెందుర్తి మండల ఇన్‌ఛార్జిగా బొడ్డు సూర్యప్రకాష్‌ను నియమిస్తూ ఆ పార్టీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా బొడ్డు సూర్యప్రకాష్ మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. పార్టీని నమ్ముకున్న ఉన్న వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు ఇప్పటికే జుత్తాడ గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేశామని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో ఎమ్మెల్యే సహకారం ఎంతో ఉందన్నారు.


నిరసన చేపడుతున్న నాయకులు

ఇసుక తవ్వకాలపై టిడిపి నిరసన

ప్రజాశక్తి-మాకవరపాలెం:మండలంలోని సర్పానదిలో అక్రమ ఇసుక తవ్వకాలను అరికట్టాలని శనివారం టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు ఆర్‌వై.పాత్రుడు మాట్లాడుతూ సర్పానదిలో అక్రమ ఇసుక తవ్వకాలతో ఆయకట్టు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శెట్టిపాలెం సర్పంచ్ అల్లు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్

ఓటు హక్కుపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:ఓటు హక్కు ద్వారా సమర్థవంతమైన నాయకుడ్ని ఎన్నుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ కోరారు. శనివారం నర్సీపట్నం మదర్ నర్సింగ్ కళాశాలలో మై ఫస్ట్ ఓట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గంలో కొత్త ఓట్లు అధికంగా నమోదయ్యాయన్నారు. రానున్న ఎన్నికల్లో తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్న ఓటర్లకు ఓటు ప్రాధాన్యతపై పూర్తి అవగాహన కల్పించే బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు నాయుడును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చింతకాయల రాజేష్, జెడ్పిటిసి సుకల రమణమ్మ, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మడ్డు వెంకటరమణ పాల్గొన్నారు.

డీటీ ఆనంద్ బదిలీ


డీటీ ఆనంద్


ప్రజాశక్తి-గొలుగొండ:మండల డిప్యూటీ తహశీల్దార్ జీ.ఆనంద్ బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మూడు సంవత్సరాలు ఒకే చోట పని చేస్తున్న వారిని బదిలీ చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు ఐదేళ్ల నుండి గొలుగొండ మండల డిటీగా పని చేస్తున్న ఆనంద్‌ను అధికారులు బదిలీ చేశారు.

గిరి ప్రదర్శన ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీలో బలిఘట్టం శ్రీబ్రహ్మ లింగేశ్వర స్వామి దేవాలయం వద్ద శనివారం గిరి ప్రదర్శనను ఎమ్మెల్యే గణేష్ దంపతులు శివుడికి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భక్తుల కోరిక మేరకు గిరి ప్రదక్షిణ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ శెట్టి చిన్న, బలిఘట్టం 18వ వార్డు కౌన్సిలర్ గవిరెడ్డి స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి సబ్ స్టేషన్ నుంచి నర్సీపట్నం వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు నూతనంగా నిర్మించిన సుమారు 3కిలో మీటర్ల బైపాస్ రోడ్డును శనివారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన వివిధ జాతీయ నాయకులను విగ్రహాలను ఆవిష్కరిం చారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ రోడ్డు నిర్మాణంతో ట్రాఫిక్ సమస్య కొంత మేరకు తీరుతుందన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ రోడ్డు నిర్మాణం జరిగిందన్నారు. 13 మంది దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోడ్డు విస్తరణలో అవాంతరాలను పరిష్కరించిన వార్డు కౌన్సిలర్ భేతిరెడ్డి రత్నం, విజయ్‌లను అభినందించారు. అనంతరం వారిని సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆయా విగ్రహాల వేషధారణలో అలరించారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, సచివాలయ కన్వీనర్ తమరాన శ్రీను, వైసిపి టౌన్ అధ్యక్షులు ఏకా శివ, సినీనటులు జోగినాయుడు పాల్గొన్నారు.



ఝాన్సీ లక్ష్మీభాయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలి


గృహాలను పరిశీలిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- కోటవురట్ల: జగనన్న గృహాలను త్వరిత గతిన నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కుమ్మరి వీధి వద్ద నిర్మాణం చేపడుతున్న గృహాలను పరిశీలించారు. సకాలంలో బిల్లులు చెల్లించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారని, నిర్మాణాలు వేగవంతం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం శాశ్వత గృహ హక్కు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు లబ్ధిదారులతో తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రమణకుమారి, హౌసింగ్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి షియాజ్ ఖాన్

9న లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మార్చి 9 న జరిగే లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఫట్టాన్ షియాజ్ ఖాన్ తెలిపారు. శనివారం పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. దీంతో విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి మధుసూదనరావు మాట్లాడుతూ, రాజీపడదగిన కేసుల్లో పోలీస్ అధికారులు, న్యాయవాదులు కక్షి దారులకు అవగాహన కలిపించాలన్నారు.

25 నుంచి ఆలయ ప్రతిష్ట ఉత్సవాలు

ప్రజాశక్తి - నక్కపల్లి:నక్కపల్లి వీవర్స్ కాలనీలో ఈనెల 25 నుండి 28 వరకు విగ్నేశ్వర ఆలయ ప్రతిష్టా మహోత్సవములు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. 25న గణపతి పూజ, అంకురార్పణ, 26 న నిత్య హోమములు, 27న పాంచామృత అభిషేకాలు, 28న మూలమూర్తుల విగ్రహ ప్రతిష్ట, అన్న సమారాధన నిర్వహించునున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. భక్తులు తరలిరావాలని కోరారు .

ఆలయం వద్ద సిమెంట్ బల్ల ఏర్పాటు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని కొమరవోలు పరదేశమ్మ ఆలయం వద్ద శనివారం సిమెంట్ బల్లను ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు కూర్చోవడానికి ఇబ్బందులు పడేవారు. దీంతో బుచ్చంపేట వార్డు కార్యదర్శి అనిమిరెడ్డి రమణ ఈ సిమెంట్ బల్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ మండలంలోని పంచాయతీల్లోని ఆలయాల వద్ద భక్తులు కూర్చోవడానికి అనువుగా బల్లలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


బల్లన ఏర్పాటు చేస్తున్న దాతలు

నాగన్నదొరకు ఘన నివాళి

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లికి చెందిన కార్మిక ఉద్యమ నేత, సిపిఎం సీనియర్ నాయకులు కామ్రేడ్ కొప్పిశెట్టి నాగన్న దొర 6వ వర్ధంతిని శనివారం నక్కపల్లిలో ఆయన కుటుంబ సభ్యులు, హాకీ క్రీడాకారుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. నాగన్న దొర చిత్ర పటానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.తాతాజీ, నాగన్నదొర కుమారుడు కె.వీరబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. తుది శ్వాస విడిచే వరకూ కూడా కమ్యూనిస్టు పార్టీ లో నే కొనసాగిన ఆదర్శ నాయకుడని, ఈ తరానికి ఎంతో ఆదర్శప్రాయులని తెలిపారు. అనంతరం హాకీ క్రీడాకారులకు పాలు, గుడ్డు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కొప్పిశెట్టి వీరబాబు, ఎం.వెంకట లక్ష్మీ, డి.నాగేంద్రకుమారి, బి.రమణ, మాజీ సర్పంచ్ ఎం.బాబులు,ఏ.లోవరాజు, ఏ.తాతారావు, డి.లోవరాజు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న అప్పలరాజు ,కుటుంబ సభ్యులు

వైవి.సుబ్బారెడ్డికి ఘన స్వాగతం

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజ్యసభ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికై మొదటి సారి విశాఖ వచ్చిన వైవి.సుబ్బారెడ్డికి వైసిపి నాయకులు శనివారం ఘన స్వాగతం పలికారు.



వైవి.సుబ్బారెడ్డికి స్వాగతం పలుకుతున్న శ్రీధర్

సీతమ్మధార : ఆర్ అండ్ బి జంక్షన్ మారియట్ హోటల్ వద్ద ఉత్తర నియోజకవర్గ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, మండల ఇన్‌చార్జిలు సీనియర్ నాయకులు, వైసిపి అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన పార్టీ జిల్లా కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు.

వేపగుంట : ఎన్ఎడి జంక్షన్ వద్ద వైవి.సుబ్బారెడ్డికి డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ స్వాగతం పలికారు. పార్టీ నేతలు, కార్యకర్తలు, మహిళలు, యువ నాయకులతో కలిసి శ్రీధర్ గజమాలతో సుబ్బారెడ్డిని సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. యువత భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 52వ వార్డు వైసిపి అధ్యక్షులు జియ్యాని మారుతి, యువజన నాయకుడు జియ్యాని విజయ్‌కుమార్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ బిఎస్.కృష్ణ తదితరులు ఉన్నారు.

మాడుగుల: ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డిని కోడూరు వైయస్సార్ నాయకులు విశాఖలోని మారియట్ హెూటల్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. మాడుగుల మండల నాయకులు, ఎం.కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవి, పిఎసిఎస్ చైర్ పర్సన్ గొల్లవిల్లి రాజేష్, వీరవిల్లి చైర్ పర్సన్ కోరుకొండ చెల్లం నాయుడు, పడాల అప్పలనాయుడు సుబ్బారెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.




క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సుష్మిత

క్షయవ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి-మధురవాడ : క్షయ వ్యాధి వారోత్సవాల్లో భాగంగా జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు మధురవాడ హైస్కూల్, వాంబే కాలనీ హైస్కూల్ పిల్లలకు క్షయ వ్యాధిపై మధురవాడ టీబీ యూనిట్ ప్రతినిధులు అవగాహన కల్పించారు. వాంబే కాలనీ యుపిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మిత మాట్లాడుతూ, రెండు వారాలకు మించిన దగ్గు, సాయంత్రం పూట జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, కఫంతో పాటు రక్తపు జీరలు పడటం వంటి లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించి సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కఫం పరీక్షలో క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఇవ్వడున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మధురవాడ టీబీ యూనిట్ సిబ్బంది వి.వీరభద్రప్పం, సురేష్, కృష్ణ, అనూష తదితరులు పాల్గొన్నారు.

గొల్ల బాబూరావుకు అభినందనలు

ప్రజాశక్తి - ఆరిలోవ : రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనా గొల్ల బాబూరావును రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేడ విజయచందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఎస్‌సి విభాగం జోనల్ ఇన్‌ఛార్జ్ అల్లంపల్లి రాజబాబు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు వానపల్లి ఈశ్వరరావు, తూర్పు నియోజకవర్గం ఎస్సీ విభాగం ఇన్‌ఛార్జ్ గూడపాటి విక్టర్, పార్టీ సీనియర్ నాయకులు పారిపల్లి రామారావు, రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ కార్యదర్శి రమేష్ శనివారం కలిసి శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.


గొల్ల బాబూరావుకు అభినందనలు తెలుపుతున్న పేడ విజయచందర్ తదితరులు

అంధకారంలో ఆంధ్ర యువత : ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం : ఆంధ్ర యువత అంధకారంలో ఉందని విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మన రాష్ట్రంలో ఉన్నత విద్య, ఉద్యోగ కల్పన లేకపోవడంతో యువత పక్క రాష్ట్రాలకు తరలిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అత్యధిక గ్రాడ్యుయేట్ నిరుద్యోగ రేటు పిఎల్ఎఫ్ఎస్ 2022 నివేదిక ప్రకారం 24 శాతం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల 2100 గ్రాడ్యుయేట్లు ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా జనవరి 1న ప్రభుత్వ ఉద్యోగాలతో జాబ్ కేలండర్ ప్రవేశపెడతానని చెప్పి ఐదేళ్లలో ఒక్కసారి కూడా విడుదల చేయలేదన్నారు. ఎస్సార్ఎం, విట్, ఎపిఐఐటి, అమృత వంటి పేరుగాంచిన విశ్వవిద్యాలయాలతో పాటు జెవియర్ లేబర్ రిలేషన్స్, ఇనిస్టిట్యూట్ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయం, ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ వంటివి గత టిడిపి ప్రభుత్వంలో ఏర్పాటయ్యాయని తెలిపారు. రాష్ట్రానికి విజినరీ ఉన్న నాయకుడు అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్య, ఉద్యోగం, ఉపాధి, అభివృద్ధి కావాలనుకునే యువత మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డులో రూ.1.25 కోట్లతో పలు అభివృద్ధి పనులకు స్టాండింగ్ కమిటీ మెంబర్ కంటిపాము కామేశ్వరి ఆధ్వర్యాన ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. సంజీవయ్యకాలనీ-2లో రూ.30లక్షలతో సామాజిక భవనం, రూ.18.90 లక్షలతో సిసి రోడ్డు, మెట్లు, కాలువల నిర్మాణం, కప్పరాడ-2లో రూ.19.45లక్షలతో యువజన సంక్షేమ సేవా సంఘం సామాజిక భవనంపై మొదటి అంతస్తు నిర్మాణం, అంబేద్కర్ ఎస్టేట్ నుంచి పెద్ద కొత్తూరు గెడ్డ వరకు రూ.18.72 లక్షలతో జిఐ వాటర్ పైప్ లైన్ మార్పు, బాపూజీనగర్ నుంచి అరుంధతి నగర్ వరకు రూ.67.97 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు వార్డులో పర్యటించి ప్రజల సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ చాణుక్య, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, జెసిఎస్ మండల కన్వీనర్ వసంతల అప్పారావు, 47వార్డు నాయకులు కోరిబల్లి విజయ్, సుకుమార్, గురువోజి, కృప, రాఘవులు, సురేష్, లక్ష్మణ్, రమేష్, చందు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కెకె.రాజు



కనమాంలో 'నడింపల్లి' ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు

కనమాంలో ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సొంట్యాం నడింపల్లి సత్యనారాయణరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన మండలంలోని కనమాంలో ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. రెండవ రోజైన శనివారం గ్రామంలో అక్షరాస్యత, ఉపాధి లేని యువత సర్వే కార్యక్రమం నిర్వహించారు. నిరక్షరాస్యులైన పెద్దలకు తక్కువ సమయంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితులలో విద్యకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆబోతు అప్పలరాము, ఎన్ఎస్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శంభుప్రసాద్, డైరెక్టర్ రాజ మురగదాస్, పిఒ హరగోపాల్ పాల్గొన్నారు.

తీరానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మాఘ పౌర్ణమి సందర్భంగా సముద్ర స్నానాలు చేయడానికి శనివారం జిల్లా నలుమూలల నుంచి మండలంలోని పూడిమడక తీరానికి భక్తులు వేలాదిమంది తరలివచ్చారు. బస్సులు, ద్విచక్ర వాహనాలు కార్లు తదితర వాటిపై వయోభేదం లేకుండా పెద్ద సంఖ్యలో రావడంతో పూడిమడక సముద్ర తీరం పోటెత్తింది. మహిళలు గంగమ్మ తల్లికి నమస్కారం చేసి పసుపు కుంకుమలు అరటి పండ్లు, చిల్లనాణేలు సముద్రంలో వేశారు. భక్తుల సౌకర్యార్థం అన్న సమారాధన, మజ్జిగ, చలివేంద్రం ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని బట్టి ఆర్టీసీ బస్సులను నడిపారు. పూ డిమడక గ్రామంలోకి వాహనాలు రాకపోకలను పోలీసులు నియంత్రించారు.

రాంబిల్లి : మాఘపౌర్ణిమ సందర్భంగా మండలంలోని వాడరాంబిల్లి గ్రామంలో తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు ఉదయం 4గంటల నుండి సముద్ర స్నానాలు ఆచరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా స్థానిక సీఐ ఎ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు చర్యలు చేపట్టారు.

దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేటలో మాఘ పౌర్ణమి సందర్భంగా జామి పెదరాము ఇంటివద్ద భక్తులు ప్రత్యేక పూజలు శనివారం నిర్వహించారు. పెదరాము ఆధ్వర్యంలో గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట, బోయపాడు సముద్ర తీరాలు మాఘ పౌర్ణమి సందర్భంగా జనసంద్రంతో నిండాయి. శనివారం మాఘ పౌర్ణమి పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు ఈ సముద్ర తీరాలకు చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. వ్యాపారులు తీరంలో తినుబండారాల దుకాణాలు ఏర్పాటు చేశారు.


వాడరాంబిల్లిలో సముద్ర స్నానాలు చేస్తున్న భక్తులు

నేరాలు ఘోరాలు

వాహనాలు ఢీ : ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -పాయకరావుపేట: మండల కేంద్రంలో నాలుగు వాహనాలు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పాయకరావుపేట వైజంక్షన్ సిగ్నల్ వద్ద శనివారం విశాఖపట్నం నుండి విజయవాడ వెళ్తున్న లారీని బస్సు ఢీకొంది. బస్సు ముందుకు వెళ్లిపోవడంతో అదే లారీ మరొక కారును బలంగా ఢీకొంది. ఆ కారు వెళ్లి ముందు ఉన్న ఐసర్ వ్యాన్‌ను గుద్దింది. ఈ ప్రమాద సంఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పాయకరావుపేట 108 సిబ్బంది బాధితులను తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

3న పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : మార్చి 3వ తేదీ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టరు రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. శనివారం ఈ విషయమై నిర్వహించిన వెబ్-ఎక్స్‌లో ఆయన మాట్లాడుతూ వివిధ శాఖల అధికారులు సమన్వయంతో జిల్లాలో వున్న 0 నుండి 5 సంవత్సరాల వయస్సు గల బాలలందరికీ పోలియో చుక్కలను వేయాలన్నారు. ముఖ్యంగా కొత్తగా నిర్మించే కాలనీలలో పనిచేసేవారి పిల్లలు, పట్టణాల గ్రామాల శివారు ప్రాంతాలలో వుంటున్న కుటుంబాలు, సంచార జాతులు మొదలైన వారి పిల్లలపై దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏ.హేమంత్ మాట్లాడుతూ జిల్లాలో 1409 బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. 2004 ఇంటింటి సర్వే బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపివో ఆర్.శిరీషారాణి, డిఆర్డిఎ పిడి శచీదేవి, స్త్రీ శిశు సంక్షేమశాఖ పిడి బి.అనంతలక్ష్మి, డిసిహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్, జివియంసి జోనల్ కమిషనర్, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మాదిగల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- సబ్బవరం : అనకాపల్లి రోటరీ క్లబ్లో ఆదివారం జరుగనున్న మాదిగల ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ అధ్యక్షులు దువ్వు మనోహర్ మాదిగ కోరారు. మండలంలోని చిన యాతపాలెం, వంగలి గ్రామాల్లో మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు బొర్రా జయరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో మనోహర్ మాట్లాడుతూ ఈ ఆత్మీయ సమావేశానికి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ హాజరు కానున్నారని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు గొటివాడ సామ్రాట్ కుమార్, ఇండుగుబిల్లి గోపి, మారేడుబూడి కోటి, గొటివాడ ఈశ్వరరావు, నిమిడితల్లి చిన్నారావు, బుజ్జి, గెడ్డం సూరిబాబు, కలిగొట్ల నాయుడు, గెడ్డం రవి పాల్గొన్నారు.

26న అడ్డురోడ్డులో వైసిపి సభ

ప్రజాశక్తి-కోటవురట్ల: అడ్డు రోడ్డులో ఈనెల 26న జరగనున్న వైసిపి విజయవంతం చేయాలని మండల వైసిపి అధ్యక్షులు శ్రీనివాసరావు కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు క్రియాశీలక పాత్ర పోషించి వైసిపి విజయానికి కృషి చేయాలని సూచించారు. సోమవారం జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పలువురు ఎంపీటీసీ సభ్యులు సర్పంచులు, వైసిపి అనుబంధ విభాగపు నాయకులు పాల్గొన్నారు.

ఎపిఎఫ్ఎ లీగ్ ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : ఎపి ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి శ్రీధర్ ఆదేశాల మేరకు విశాఖ రైల్వే గ్రౌండ్‌లో ఎపిఎఫ్ఎ లీగ్ పోటీలను శనివారం లీగ్ కో-కన్వీనర్ సుస్మిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాజారావు, కార్యదర్శి అక్కరమాని చినబాబు, రామకృష్ణ, గోవింద్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


లీగ్ పోటీల ప్రారంభంలో సుస్మిత తదితరులు


గోపాలపట్నంలో షోరూంను ప్రారంభిస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి

వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూంలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అనకాపల్లిలో వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూంను శనివారం ఉదయం కొణతాల రాజేంద్ర, వివిఎస్.నూకరాజు, కోరుకొండ బుచ్చిరాజుల సమక్షంలో గుంపిన రమేష్ ప్రారంభించారు. అనంతరం ఎంవిపి బిల్డర్స్ అండ్ ఎస్టేట్స్ జామి భోజరాజు మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూయలర్స్ డైరెక్టర్ వైశ్యరాజు నరేష్ రాజు మాట్లాడుతూ విభిన్నమైన జ్యువలరీ డిజైన్లు, విస్తృత శ్రేణి కలెక్షన్లలో ఉన్న అన్ని రకాల బంగారు ఆభరణాలకు ప్రారంభోత్సవ ఆఫర్‌గా ఫ్లాట్ 6 శాతం తరుగుకే, బంగారం ఎక్స్‌ఛేంజ్‌పై అన్ని రకాల బంగారు ఆభరణాలను పొందవచ్చునని, సిల్వర్ ఆర్టికల్స్ కొనుగోలుపై కిలోకి రూ.10 వేలు తగ్గింపుతో పాటు ఆఫర్ తొమ్మిది గ్రాములు పైబడిన బంగారు ఆభరణాలపై తగ్గింపు వర్తిస్తుందని తెలిపారు. కావున ప్రతి ఒక్కరూ ఈ ప్రారంభోత్సవ ఆఫర్‌ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణ రాజు, డైరెక్టర్లు వైశ్యరాజు భద్రగిరి రాజు, వైశ్యరాజు కిరణ్ కుమార్ రాజు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో..

గోపాలపట్నంలో వైశ్యరాజు జ్యూయలర్స్ షోరూంను శ్రీ శారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి ప్రారంభించారు. అనంతరం ఎంవిపి బిల్డర్స్ అండ్ ఎస్టేట్స్ జామి భోజరాజు మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యువెలర్స్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ ఆఫర్ల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫాల్గుణ రాజు, డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్ రాజు, వైశ్యరాజు కిరణ్ కుమార్ రాజు పాల్గొన్నారు,

సిఐఐ విశాఖ జోన్ చైర్మన్‌గా రాజేష్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సిఐఐ విశాఖపట్నం జోన్‌కు 2024-25 సంవత్సరానికి చైర్మన్‌గా ఇంటిగ్రల్ ట్రేడింగ్ అండ్ లాజిస్టిక్స్ మేనేజింగ్ పార్టనర్ గ్రాంధి రాజేష్, వైస్ ఛైర్మన్‌గా నిర్మాణ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.అజయ్ కుమార్ ఎన్నికయ్యారు. విశాఖలో జరిగిన సిఐఐ వార్షిక సమావేశంలో సంస్థ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ ఎం.లక్ష్మీప్రసాద్ నూతన సభ్యుల వివరాలను వెల్లడించారు.


రాజేష్

ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పబ్లిక్ హెల్త్ వర్కర్లుగా ఐదుగురు విభిన్న ప్రతిభావంతులకు జివిఎంసి అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు శనివారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందించారు. టి.లక్ష్మమ్మ, వై.నిర్మల, వి.గంగునాయుడు, ఎల్.శివ నారాయణ, ఎం.రాజేష్‌లు నియామక పత్రాలు అందుకున్న వారిలో ఉన్నారు.

హై సెక్యూరిటీ ప్లేట్లు తప్పనిసరి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలో ప్రయాణించే వాహనాలన్నీ కచ్చితంగా హై సెక్యూరిటీ ప్లేట్లు కలిగి ఉండాలని, లేని పక్షంలో పాత, కొత్త వాహనాలపై కేసులు నమోదవుతాయని విశాఖపట్నం ఉప రవాణా కమిషనర్ జిసి.రాజారత్నం తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'ఉక్కు'కు ఊరట దక్కేనా!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'ప్రజలు చేసే పొరపాట్ల వల్ల కాదు.. పాలకులు చేసే తప్పుల వల్ల పోరాటాలు ఉద్భవిస్తాయి' అని విశ్లేషకులు చెప్పినట్టే విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయంలో తొలినుంచీ పాలకులు చేసిన తప్పిదాల వల్ల నష్టాల పాలై కార్మిక పోరాటానికి ఆ పరిస్థితి దారితీసింది. సుమారు మూడు సంవత్సరాలుగా కార్మికులు, ప్రజానీకం స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకోడానికి పోరాడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరానికి మార్చి 1న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పర్యటన ఖరారైంది. 2024 ఎన్నికల సమయం కాబట్టి మనసు మార్చుకుని మోడీ ఉక్కును ప్రైవేటుపరం చేయబోమని చెబుతారన్న ఆశతో సాధారణ ప్రజానీకం ఎదురు చూస్తున్నారు. అయితే స్టీల్ కార్మికవర్గం మాత్రం మోడీ ప్రకటన చేయకపోతే ఎన్నికల్లో బిజెపిని ఓడిస్తామంటూ ప్రతినబూనారు. 'మూసేస్తాం..లేదంటే అమ్మేస్తాం' అనే నినాదాన్ని మోడీ స్టీల్‌ప్లాంట్ విషయంలో తీసుకోవడంతో విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజానీకం పెద్ద సంఖ్యలో మోడీ విధానాన్ని తూర్పారబడుతున్నారు.

ఉపాధి, ఉత్పత్తిలోనూ ఎప్పుడూ అగ్రగామే..

లక్ష మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి నివ్వడమే కాకుండా, ఉత్పత్తిలోనూ అగ్రగామిగా స్టీల్ కర్మాగారం నిలుస్తోంది. అనేక త్యాగాలతో సాధించుకున్న ఈ ప్లాంట్ సొంత గనులు కేటాయించనందున తీవ్రంగా నష్టపోతోంది. రూ.లక్షల కోట్ల ఆస్తులు కలిగిన ప్లాంట్‌కు కేవలం రూ.5 వేల కోట్లు కేంద్రం రుణసాయం ఇప్పించనందున నష్టాల బారిన పడిందన్నది జగద్విితం. వీటన్నిటికీ తోడు దీన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే బిజెపి మోడీ ప్లాన్‌తో కార్మికవర్గం తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. 1100 రోజులకు పైగా స్టీల్ పరిరక్షణ పోరాటం నడుస్తోంది.



అమ్మడానికి మోడీకి, కొనడానికి అదానీ, జిందాల్ వంటి ప్రైవేట్ సంస్థలకూ ఎలాంటి హక్కూ లేదని ఇది పూర్తిగా ప్రజలు, కార్మికుల ఆస్తి అని ఎపిలో బిజెపి మినహా సిపిఎం, సిపిఐ అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో చెబుతున్నాయి.

2024 ఎన్నికల తరుణాన మోడీ విశాఖ వస్తున్న సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటన చేస్తారా? ఆయనతో అంటకాగుతున్న జనసేన పార్టీ, ఆ పార్టీతో పొత్తు కోసం వెంపర్లాడే తెలుగుదేశం పార్టీ మోడీకి నచ్చచెప్పి స్టీల్‌ప్లాంట్‌పై ప్రకటనకు ఒత్తిడి తెస్తాయా? అన్నది చూడాల్సిందే.

తన పాలనాకాలంలో ఒక ప్రధాన, ప్రతిష్టాత్మక పరిశ్రమను మూతపెట్టాలని కేంద్రం చూస్తుంటే గుడ్లప్పగించి చూసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖకు ఎన్నిసార్లు వచ్చినా స్టీల్‌ప్లాంట్ గురించి ఒక్కమాటా మాట్లాడకుండా వెళ్లడం తెలిసిందే. మోడీపై జగన్ ఒత్తిడి తెచ్చి తమ ప్రభుత్వ పరువు నిలుపుకుంటాడా ? ఇవన్నీ సమాధానాలు దొరకని ప్రశ్నలుగా ఉన్నాయి.

టికెట్ల కేటాయింపుతో సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెలగపూడి రామకృష్ణ బాబును టిడిపి అధిష్టానం ప్రకటించడంతో ఎంవిపి కాలనీలో ఆ పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభి రామ్ అధ్వర్యంలో కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జోన్ 1 మీడియా కోఆర్డినేటర్ బైరెడ్డి పోతన్న రెడ్డి, నాయకులు రామచంద్రరావు, రాజు, నరేంద్ర, వాసు, దేముడుబాబు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


తూర్పులో మిఠాయిలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజక వర్గం టిడిపి- జనసేన పార్టీల ఉమ్మడి శాసనసభ అభ్యర్థిగా వంగలపూడి అనిత పేరును శనివారం టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించడంతో టిడిపి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. నియోజకవర్గ పార్టీ క్యాడర్ ఊహించినట్టుగానే టిడిపి అధిష్టానం అనిత పేరు ప్రకటించడంతో నక్కపల్లి లో క్రిష్ టౌన్ షిప్ లో అనిత స్వగృహానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. అనితకు శుభాకాంక్షలు తెలియజేసి, బాణాసంచా పేల్చి, సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అనిత పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఉపమాక వెంకన్న క్షేత్రానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఇదిలా ఉండగా వంగలపూడి అనిత ఉపాధ్యాయురాలుగా పని చేస్తూ 2014 రాజకీయ అరంగేట్రం చేసి, టిడిపిలో చేరారు. 2014 లో మొట్టమొదటిసారిగా పాయకరావుపేట నియోజకవర్గం నుండి టిడిపి నుండి శాసనసభ సభ్యురాలుగా పోటీ చేసి గెలుపొందారు. 2019 శాసనసభ ఎన్నికల ముందు అనితకు నియోజకవర్గంలో పార్టీ లో అసమ్మతి సెగ తగలడంతో కొవ్వూరు అసెంబ్లీ టిక్కెట్ కేటాయించడంతో అక్కడ ఓటమి చెందడంతో టిడిపి అధిష్టానం ఆమెను పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జిగా నియమించారు. అప్పటి నుంచి ఆమె పాయకరావుపేట నియోజకవర్గాన్ని కనిపెట్టుకొని ఉన్నారు.

అరకు లోయ : టిడిపి అరకు ఎమ్మెల్యే అభ్యర్థిగా సివేరి దొన్నుదొరను చంద్రబాబు ప్రకటించడంపై ఆ పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. అరకులో శనివారం జనసేన, తెలుగుదేశం నేతలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా పేల్చి దొన్ను దొరకు మిఠాయిలు తినిపించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, అరకు పార్లమెంటు కోశాధికారి వంతల నాగేశ్వరరావు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, డుంబ్రిగుడ మాజీ ఎంపీపీ కొర్ర ధన్నేరావు, పార్టీ మాజీ అధ్యక్షులు సుబ్బారావు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ భాస్కరరావు, టి యన్ టి యు సి నాయకులు మండ్య గురుస్వామి పాల్గొన్నారు.

జనసేన శ్రేణుల ఊరేగింపు

నేడు పార్టీ శ్రేణులతో పరుచూరి సమావేశం

అనకాపల్లి : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థిగా మాజీ మంత్రి కొణతాల రామకృష్ణను ఎంపిక చేయడం పట్ల జనసేన శ్రేణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాయి. పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించాయి. ఇదిలా ఉండగా జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ పరుచూరి భాస్కరరావు జనసేన శ్రేణులతో ఆదివారం సమావేశం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలియజేశాయి. ఇదే తన ఆఖరి సమావేశం అని, పార్టీకి గుడ్ బై చెబుదామన్నట్టు చెబుతున్నారు.

చిరువ్యాపారులపై మళ్లీ చిందులేసిన జనసేన కార్పొరేటర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ 22వ వార్డులోని చిరు వ్యాపారులపై మరోసారి చిందులేశారు. వార్డులోని తమ సమస్యలను కార్పొరేటర్ పరిష్కరిస్తారని భావించామని, ఇలా తలనొప్పిగా మారతారని అనుకోలేదని చిరు వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. తోపుడు బండ్ల వ్యాపారులను, చిరు వ్యాపారులను శనివారం మూర్తి యాదవ్ పిలిచి పిఠాపురం కాలనీ రోడ్డులో వ్యాపారాలు చేస్తే సహించేది లేదని కేకలు వేయడం అక్కడ వారిని ఆశ్చర్యానికి గురిచేసింది. పైగా మాజీ ఎమ్మెల్సీ మాధవ్ కార్యాలయం రోడ్డు నిర్మానుష్యంగా ఉంటుందని అక్కడ వ్యాపారం చేసుకోండని సూచించారు. జనంలేని చోట తాము వ్యాపారం చేసుకునేది ఎట్లా అని చిరువ్యాపారులంతా ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, జనసేన నాయకులు వంశీకృష్ణ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. మూర్తి యాదవ్ తీరుపై సొంత పార్టీ వారే మండిపడుతున్నారు.

26న ఆటో మోటార్ సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆటో మోటార్ డ్రైవర్స్‌కు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్‌పై ప్రభుత్వం పన్నుల మినహాయింపు ఇవ్వాలని, ఇ- చలనాలు, జిఒ 21 రద్దు చేయాలని, మోటార్ ట్రాన్స్‌పోర్ట్ చట్టం 2019కు సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జగదంబ దరి సిఐటియు కార్యాలయంలో తలపెట్టిన సదస్సును జయప్రదం చేయాలని విశాఖ జిల్లా మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు, విశాఖ ఆటో రిక్షా కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శనివారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడారు. దేశంలో ఆటో మోటార్ కార్మికులు స్వయం ఉపాధితో జీవిస్తున్నారన్నారు. వారి నుంచి వివిధ రకాల పన్నుల రూపంలో సుమారుగా రూ.56 లక్షల కోట్లు ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుందన్నారు. దానిలో ఒక శాతం తిరిగి ఆ డ్రైవర్లకు కేటాయించాలని, పిఎఫ్, ఇఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు.

అనాథకు పెళ్లి చేసిన ఎయుటిడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎయుటిడి ఆధ్వర్యంలో ఒక అనాథ యువతకు శనివారం వివాహం జరిపించారు. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అనిత తొమ్మిదేళ్ల వయసులోనే తల్లిదండ్రులు చనిపోయారు. ఆమె నగరంలోని పాపా హోం, స్వధార్ హోంలలో ఉంటూ ఇంటర్మీడియట్ వరకు కష్టపడి చదువుకుంది. ఆమె వయస్సు 20 సంవత్సరాలు. తను మేజర్ అవడంతో స్వధార్ హోం వారు. జివిఎంసి టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఎయుటిడి షెల్టర్‌కి అప్పగించారు. అనితకి ఒక మంచి జీవితం అందించడం కోసం గతంలో ఆదే షెల్టర్‌లో ఉంటూ ఉపాధి పొందిన ఖాదర్ ముందుకు రావడంతో ఇద్దరి అభీష్టం మేరకు శనివారం భీంనగర్ షెల్టర్‌లో నిరాశ్రయుల అందరి సమక్షంలో వివాహం జరిపించారు. అనితకి ఎయుటిడిలో ఉద్యోగ అవకాశం కూడా కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు మీడియాకు తెలిపారు.

యువత ఆలోచించి ఓటు వేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో ఐటిని అభివృద్ధి చేసిన చంద్రబాబుకే మొదటి ఓటు వేయాలని టిడిపి జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కోరారు. 'మై ఫస్ట్ ఓట్ ఫర్ సిబిఎన్' కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మొదటి సారి ఓటు వేసే యువత ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, భీమిలి ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు పాల్గొన్నారు.

జిసిసిలో పలువురికి ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గిరిజన సహకార సంస్థ (జిసిసి)లో రాష్ట్రవ్యాప్తంగా వివిధ చోట్ల పనిచేస్తున్న 41 మంది సేల్స్‌మ్యాన్లకు ప్రమోషన్లు కల్పిస్తూ శనివారం సంస్థ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి నియామక పత్రాలు అందజేశారు. వారంతా జూనియర్ అసిస్టెంట్లుగా ఇక నుంచి విధులు నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్ కుమార్, విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుల్లి భాగ్యలక్ష్మి, జనరల్ మేనేజర్ (పరిపాలన) జె.యూస్టస్, డివిజనల్ మేనేజర్, రంపచోడవరం, పార్వతీపురం డివిజన్ల అధికారులు పాల్గొన్నారు.